GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
MEDIA
మెయిన్ :ఆదివారం- జనవరి 28-2024 పేజీలు : 3

1న ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్న కేసీఆర్

టీ మీడియా, జనవరి 27, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫిబ్రవరి 1వ తేదీన ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు. స్పీకర్ సమక్షంలో ఆయన ప్రమాణం చేస్తారు. గజ్వేల్ నుంచి గెలిచిన కేసీఆర్ ఆస్పత్రిలో చేరడంతో ఇప్పటి వరకు ప్రమాణ స్వీకారం చేయలేదు. ఇటీవల ఆయన కోలుకున్నారు. దీంతో త్వరలో ప్రమాణం చేయనున్నారు. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. గజ్వేల్ నుంచి కేసీఆర్ వరుసగా మూడోసారి విజయం సాధించారు. ఇటీవలి ఎన్నికల్లో సమీప బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై 45 వేల మెజార్టీతో విజయం సాధించారు.

త్వరలో రాష్ట్రంలో కుల గణన

- నియోజకవర్గానికో ఇంటిగ్రేటేడ్ ఎడ్యుకేషన్ హబ్
- గురుకులాలకు సొంత భవనాలకు స్థలాల గుర్తింపు
- గ్రీన్ ఛానల్ ద్వారా డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపు
- విదేశాలకు వెళ్లే విద్యార్థులకు మరింత ప్రయోజనం
- సంక్షేమ విభాగాల సమీక్షలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి

టి మీడియా, జనవరి 27, హైద్రాబాద్ : మహాత్మ జ్యోతిభాపూలే ఓవర్ సీస్ స్కాలర్ షిప్ స్కీమ్ ను మరింత సమర్థంగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పుడున్న దాని కంటే ఎక్కువ మంది అర్హులైన విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలని అన్నారు. విదేశాల్లో ఉన్న యూనివర్సిటీల ర్యాంకింగ్ ల ఆధారంగా టాప్ యూనివర్సిటీలను గుర్తించి ఫ్రేమ్ వర్క్ తయారు చేయాలని అన్నారు. వాటిలో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఈ స్కీమ్ లో మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలన్నీ వేర్వేరు చోట్ల విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటేడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటేడ్ హబ్ నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. దీంతో స్కూళ్ల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ కూడా మరింత మెరుగ్గా చేసే వీలుంటుందని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవటం ద్వారా వారిలో ప్రతిభా పాఠవాలు పెరుగుతాయని, పోటీ తత్వం పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్ ల నిర్మాణానికి సరిపడే స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో వీలు కాకుంటే ప్రత్యామ్నాయంగా అదే సెగ్మెంట్లో మరో పట్టణం లేదా మండల కేంద్రాలను ఎంచుకోవాలని సూచించారు. ఇప్పటికే 20 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న స్కూల్ ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్ గా తీర్చిదిద్దే అవకాశాలుంటే పరిశీలించాలని అన్నారు.

ఎడ్యుకేషన్ హబ్ ల నిర్మాణానికి కార్పొరేట్ సంస్థల, కంపెనీల సహకారం తీసుకోవాలని సీఎం అన్నారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్ ను సమీకరించాలని, ముందుకు వచ్చే దాతల నుంచి విరాళాలు స్వీకరించి ఈ భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఇచ్చే దుప్పట్లు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, పుస్తకాలకు కూడా సీఎస్ఆర్ ద్వారా నిధులు సమీకరించాలని సూచించారు.

కళ్యాణ మస్తు, షాదీ ముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు అంచనా బడ్జెట్ ను రూపొందించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పుడున్న బీసీ స్టడీ సర్కిళ్లను ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్ గా ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ శ్రీ పొన్నం ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గారు, ప్రభుత్వ సలహాదారు శ్రీ షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

త్వరలోనే రాష్ట్రంలో కుల గణన చేపడుతామని ముఖ్యమంత్రి శ్రీ ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం ఈ నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కుల గణనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు సచివాలయంలో బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ విభాగాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని సూచించారు. వీటికి సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన భవనాల నిర్మాణానికి సరిపడే స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో స్కూల్ నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో అంచనా వేసి బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఇచ్చే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు, వంట బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేయాలని అన్నారు.

ఇక్కడున్నది... అర్జునుడు

- యుద్ధంలో చంద్రబాబు సహా అందరూ ఓడాల్సిందే
- భీమిలిలో ఏపీ సీఎం జగన్ ఎన్నికల శంఖారావం

టీ మీడియా, జనవరి 27, భీమిలి : ఏపీ సీఎం జగన్ భీమిలిలో ఎన్నికల శంఖారావం పూరించారు. ఎన్నికల సమరానికి సై అన్నారు. ఎన్నికలకు వైసీపీ సిద్ధం అంటూ తొలి బహిరంగ సభలో మాట్లాడారు. ప్రతిపక్షాలపై జగన్ ఫైర్ అయ్యారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పై నిప్పులు చెరిగారు. ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు అర్జునుడు అని డైలాగ్ చెప్పారు జగన్. ఎన్నికలను యుద్ధంతో పోల్చిన జగన్.. ఈ యుద్ధంలో చంద్రబాబు సహా అందరూ ఓడాల్సిందే అని వ్యాఖ్యానించారు. మనది ప్రజల ప్రభుత్వం. మనది వయసుతో పాటు మనసు, భవిష్యత్తు ఉన్న పార్టీ. భీమిలిలో అటు సముద్రం, ఇటు జన సముద్రం కనిపిస్తోంది. 175 స్థానాల్లో పోటీ చేసేందుకు కూడా వారికి అభ్యర్థులు లేరు. చేసిన అభివృద్ధిని నమ్ముకుని మళ్లీ ప్రజల దగ్గరికి వెళ్తున్నా. ఈ యుద్ధంలో చంద్రబాబు సహా అందరూ ఓడాల్సిందే. కురుక్షేత్ర యుద్ధానికి సిద్ధమైన పాండవుల సైన్యం కనిపిస్తోంది. ఇంతమంది కృష్ణుడి రూపంలో అండగా ఉన్నారు. ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు.. అర్జునుడు. ఇక్కడ పాండవ సైన్యం ఉంటే.. ప్రత్యర్థుల దగ్గర కౌరవ సైన్యం ఉంది. చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదు. అందుకే దత్తపుత్రుడిని వెంటేసుకుని తిరుగుతున్నారు. మన మేనిఫెస్టోలో 99శాతం హామీలను నెరవేర్చాం. అటు వైపు కౌరవ సైన్యం ఉంది. గజదొంగల ముఠా ఉంది. మరో 25ఏళ్ల పాటు మన జైత్రయాత్రకు శ్రీకారం చుడుతున్నాం. నేను మోసాన్ని, అబద్ధాన్ని నమ్ముకోలేదు. చేసిన మంచిని, అభివృద్ధిని నమ్ముకునే మీ బిడ్డ.. ఎన్నికలకు వెళ్తున్నాడు. గత ఎన్నికల్లో వచ్చిన 23 స్థానాలు కూడా ఈసారి టీడీపీకి రావు" అని సీఎం జగన్ అన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌గా మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

- సభ్యులుగా అనితా రాజేంద్ర, యాదయ్య, పాల్వాయి రజనీకుమారి
- ప్రమాణం చేయించిన గవర్నర్

టీ మీడియా, జనవరి 27, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మెన్‌గా మాజీ డీజీపీ పి మహేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనతోపాటు సభ్యులు అనితా రాజేంద్ర, ప్రొఫెసర్ ఎన్ యాదయ్య, పాల్వాయి రజనీకుమారితో ప్రమాణం చేయించారు. అనంతరం వారు కూడా బాధ్యతలను స్వీకరించారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో చైర్మెన్ మహేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్‌తోపాటు ఐదుగురు సభ్యులను ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం ఆమోదించిన విషయం తెలిసిందే.

టీఎస్‌పీఎస్సీకి కొత్త పాలకమండలి రావడంతో ఉద్యోగ నియామకాల ప్రక్రియ వేగవంతం అవుతుందని నిరుద్యోగులు ఆశిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ పదవికి డాక్టర్ బి జనార్ధన్‌రెడ్డి గతనెల 11న, సభ్యులు ఆర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ బండి లింగారెడ్డి, కారం రవీందర్‌రెడ్డి అదేనెల 13న రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. వాటిని ఈనెల 10న గవర్నర్ ఆమోదించారు. ఈనెల 19న మరో సభ్యురాలు సుమిత్రా ఆనంద్ తనోబా రాజీనామా చేశారు. గత ప్రభుత్వం నియమించిన కోట్ల అరుణకుమారి మాత్రమే సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ఆమెతో కలిపి టీఎస్‌పీఎస్సీలో ఆరుగురు సభ్యులున్నారు. ఇంకా నలుగురు సభ్యులను నియమించడానికి అవకాశమున్నది. కాగా ఇద్దరు సభ్యులు అమీర్ ఉల్లాఖాన్, యరబాది రామ్మోహన్‌రావు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉన్నది.

చాయ్ దుకాణం ముందు గవర్నర్ బైఠాయింపు..

-కాన్వాయ్‌ని ఎస్ ఎఫ్ ఐ అడ్డగించడంపై ఆగ్రహం.

టీ మీడియా, జనవరి 27, కేరళ : లో అక్కడి ప్రభుత్వానికి, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కు మధ్య నెలకొన్న వివాదం రోజురోజుకు మరింత తీవ్రమవుతోంది. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ కేవలం 78 సెకన్‌లు మాత్రమే ప్రసంగించారు. ప్రభుత్వం ఇచ్చిన 60 పేజీల ప్రసంగాన్ని చదవకుండా పక్కనపడేశారు. దాంతో రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్ హోమ్‌ను పినరయి విజయన్ సర్కారు బహిష్కరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో శనివారం ఉదయం ఎస్ ఎఫ్ ఐ ఆందోళనకారులు కొల్లామ్‌లో గవర్నర్ కాన్వాయ్‌కి అడ్డుతగిలారు. యూనివర్సిటీ ఛాన్సెలర్ల నియామకానికి గవర్నర్ అడ్డుపుల్ల వేస్తున్నాడంటూ నల్లజెండాలు ప్రదర్శించారు. దాంతో ఆగ్రహించిన గవర్నర్ కారు దిగి ఆందోళనకారుల వైపు దూసుకెళ్లారు. దాంతో గవర్నర్ రక్షణగా పోలీసులు హ్యూమన్ షీల్డ్ ఏర్పాటు చేశారు. గవర్నర్‌ను తిరిగి కారులోకి రావాలని విజ్ఞప్తి చేశారు. కానీ గవర్నర్ అందుకు నిరాకరించారు. పోలీసుల వైఫల్యంవల్లే ఎస్ ఎఫ్ ఐ కార్యకర్తలు తన కాన్వాయ్‌కి అడ్డుతగిలారని మండిపడ్డారు. తన కాన్వాయ్ వెళ్లే మార్గంలో ఎస్ ఎఫ్ ఐఆందోళన కారులను ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో ఇలాగే అనుమతిస్తారా..? అని నిలదీశారు. పోలీసుల తీరును నిరసిస్తూ అక్కడే రోడ్డు పక్కన ఉన్న చాయ్ దుకాణం ముందు బైఠాయించారు. ఆందోళకారులపై చర్యలు తీసుకునే వరకు తాను ఇక్కడి నుంచి కదిలేదే లేదని తేల్చిచెప్పారుదాంతో పోలీసులు ఘటనకు సంబంధించి 12 మందిని అరెస్ట్ చేశామని గవర్నర్‌కు చెప్పారు. తన కాన్వాయ్‌కి 50 మందికి పైగా అడ్డుతగిలితే 12 మందినే ఎందుకు అరెస్ట్ చేశారని ఆయన ప్రశ్నించారు. మిగతా వాళ్ల సంగతేమిటని మండిపడ్డారు. ఆందోళనకారుల అరెస్ట్‌లకు సంబంధించి FIR కాపీలు చూపించాలని అన్నారు

ఎవరి లెక్కలు వారివి

- లోక్ సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు.
- బీఆర్ఎస్ అధిష్ఠానం స్పెషల్ ఫోకస్

టీ మీడియా, జనవరి 27, హైదరాబాద్: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలు పార్లమెంట్ ఎన్నికలపై కసరత్తు ముమ్మరం చేశాయి. బీఆర్ఎస్ అధిష్ఠానం కూడా స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందన్న ప్రచారంతో గులాబీ బాస్ ఎంపీ అభ్యర్థులపై కసరత్తు మొదలుపెట్టారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. కారు- సారు-పదహారు నినాదంతో 9 సీట్లు గెలిచింది. అయితే ఈసారి అధికారంలో లేకపోవడంతో మరింత శ్రమించి ఎక్కువ స్థానాలను గెల్చుకోవాలని వ్యూహాలు రచిస్తోంది.

ఇక బీజేపీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని కరీంనగర్ నుంచి మొదలుపెట్టాలని డిసైడ్ అయింది. 2019 ఎన్నికల్లో 4 ఎంపీలు గెలిచిన కమలం పార్టీ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరగడంతో డబుల్ డిజిట్ మార్క్‌కు చేరాలని టార్గెట్‌గా పెట్టుకుంది. దీనిలో భాగంగా రేపు కేంద్రహోంమంత్రి అమిత్ షా కరీంనగర్‌లో బీజేపీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా టార్గెట్ ఫిక్స్ చేసుకుంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే లోక్‌సభ ఎన్నికలే టార్గెట్ దూసుకెళ్తోంది. 2019 ఎన్నికల్లో 3 సీట్లకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ.. ఈసారి అధికారంలో కూడా ఉండడంతో 12 నుంచి 14 సీట్లు గెలవాలని పీసీసీ నేతలు లెక్కలు వేస్తున్నారు. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రధానంగా పోటీ ఉండనుంది. అయితే ఇప్పటికే టార్గెట్ ఫిక్స్ చేసుకున్న మూడు పార్టీలు.. త్వరలోనే అభ్యర్థులను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నాయి.

జార్ఖండ్ సీఎం సోరెన్‌కు మరోసారి ఈడీ సమన్లు

టీ మీడియా, జనవరి 27, న్యూఢిల్లీ : జార్ఖండ్ హేమంత్ సోరెన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం మరోసారి సమన్లు పంపింది. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు ఈ నెల 29న లేదంటే 31న సమయంలో ఇవ్వాలని సమన్లలో కోరింది. లేకపోతే ఏజెన్సీ వెళ్లి విచారించనున్నట్లు ఈడీ స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రికి ఈడీ సమన్లు జారీ చేయడం ఇది తొమ్మిదోసారి. ఎనిమిది సమన్లలో జనవరి 6 నుంచి 20 వరకు విచారణకు రావాలని ఈడీ కోరగా.. దీంతో ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు హేమత్ సోరెన్ పిటిషన్‌ను తిరస్కరించింది. తొమ్మిదవసారి జారీ చేసిన సమన్లలో జనవరి 27 నుంచి 31 వరకు ఈడీ ముందు ముఖ్యమంత్రి హాజరుకావాలని కోరింది. ఇదిలా ఉండగా.. అంతకు ముందు ఈడీ సోరెన్‌ను ఆయన నివాసంలో సుమారు ఏడుగంటల పాటు విచారించింది. జార్ఖండ్ రాజధాని రాంచీలోని బర్రాప్రాంతంలో 7.16 ఎకరాల భూమికి సంబంధించిన భూ కుంభకోణంలో హేమంత్ సోరెన్‌ను ఈడీ విచారించనున్నది. ఈ కేసులో ఇప్పటి వరకు 14 మంది అరెస్టయ్యారు. ఇందులో 2011 బ్యాచ్‌కు చెందిన అధికారులు ఛవీ రంజన్, భాను ప్రసాద్, వ్యాపారవేత్తలు అమిత్ అగర్వాల్, బిష్ణు అగర్వాల్ ఉన్నారు. ముఖ్యమంత్రికి సైతం సమన్లు జారీ చేయగా.. ఆయన విచారణకు గైర్హాజరయ్యారు. దాంతో ఈడీ ఆయన ఇంటికి వెళ్లి విచారించింది.

నకిలీ పాస్‌పోర్టు కేసులో లుకౌట్ నోటీస్ జారీ

టీ మీడియా, జనవరి 27, హైదరాబాద్: నకిలీ పాస్‌పోర్టు కేసులో సీఐడీ అధికారులు లుకౌట్ నోటీస్ జారీ చేశారు. ఫేక్ పాస్‌పోర్టుతో 92 మంది దేశం విడిచి వెళ్ళినట్టు ఇప్పటికే సీఐడీ అధికారులు గుర్తించారు. 92 మంది వివరాలను విదేశాంగ శాఖకు పంపించారు. 92 మందిని వెనక్కి రప్పించి విచారించాలని సీఐడీ భావిస్తోంది. ఈ క్రమంలోనే ఈ 92 మంది పాస్‌పోర్టులను రద్దు చేయాలని రీజినల్ పాస్‌పోర్టు ఆఫీస్‌కు సీఐడీ లేఖ రాసింది. పాస్‌పోర్టు రద్దు అయిన విషయాన్ని 92 మంది ఉన్న దేశాలకు అధికారులు పంపనున్నారు. ఆయా దేశాల నుంచి వారే బలవంతంగా వెనక్కి పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకే ఆధార్ నంబర్‌తో అనేక చిరునామాలు, ఫేక్ పత్రాలు సృష్టించి 92 మంది పాస్‌పోర్టులను పొందారు. ఈ కుంభకోణంలో ఏజెంట్లు, పాస్‌పోర్టు సిబ్బంది, ఎస్‌బీ సిబ్బంది కుమ్మక్కైనట్టు సీఐడీ అధికారులు భావిస్తున్నారు. జగిత్యాలతో పాటు ఫలక్‌నుమా చిరునామాలతో ఫేక్ పాస్‌పోర్టులు ఎక్కువగా పొందినట్లు గుర్తించారు. బర్త్ సర్టిఫికెట్ కోసం నిందితులు నిలోఫర్ పేరు వాడుకున్నారు.

కారును ఢీకొన్న ట్రక్కు

-ప్రమాదలో ఐదుగురు మృతి

టీ మీడియా, జనవరి 27,హెూషియార్పూర్ : పంజాబ్‌లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. కారులో చెలరేగిన మంటల వల్ల వారంతా సజీవదహనమయ్యారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. ఇక ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి పంజాబ్‌లోని జలంధర్ %--% పఠాన్‌కోట్ రహదారిపై ట్రక్కు కారును ఢకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. జలంధర్ నుంచి మొకేరియన్‌కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు దసూయా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ హర్ప్రీమ్ సింగ్ తెలిపారు. కారు ఉండి బస్సి గ్రామం వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం రోడ్డు డివైడర్‌ను ఢకొట్టింది. ఆ తర్వాత రోడ్డుకు అవతలివైపు నుంచి ఎదురుగా వస్తున్న ట్రక్కు కారును ఢకొట్టింది. దీంతో కారులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తిని సివిల్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హర్యానాకు చెందిన ట్రక్ డ్రైవర్ సుశీల్ కుమార్‌కు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనపై విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

హాస్టల్‌లోకి ప్రవేశించిన దుండగులు

- విద్యార్థినిల ఆందోళన

టీ మీడియా, జనవరి 27, కారానా (సికింద్రాబాద్) : తమకు రక్షణ కల్పించాలంటూ హాస్టల్ విద్యార్థినిలు ఆందోళన చేపట్టిన ఘటన శనివారం తెల్లవారుజామున సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాల హాస్టల్ వద్ద జరిగింది. ఈరోజు తెల్లవారుజామున స్థానికంగా ఉండే ముగ్గురు హాస్టల్ గోడదూకి ప్రాంగణంలోకి ప్రవేశించారు. స్నానాల గదిలోకి చొరబడి సైగలు చేశారు. దుండగులను విద్యార్థినులు పట్టుకునేందుకు ప్రయత్నించగా, ఇద్దరు పరారయ్యారు. మరో వ్యక్తికి దేహశుద్ధి చేసి, బేగంపేట పోలీసులకు అప్పగించారు. మిగిలిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కళాశాల ఎదుట బైఠాయించి విద్యార్థినులు నిరసన చేపట్టారు. హాస్టల్లో తమకు భద్రత కరవైందని ఈ విషయంపై వీసీ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై డిసిపి రోహిణి మాట్లాడుతూ %్రా% అమ్మాయిల హాస్టల్‌లోకి ముగ్గురు ప్రవేశించి, అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. రక్షణ విషయంలో ప్రిన్సిపల్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

సొంత ఇంటిని కూల్చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే

టి మీడియా, జనవరి 27,కామారెడ్డి :ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. గత ఏడాది జరిగిన సవాళ్లు, ప్రతి సవాళ్ళలో చెప్పినట్టుగానే రోడ్డు వెడల్పుకు అడ్డుగా ఉన్న తన సొంత ఇంటిని కూల్చేసి మాట నిలబెట్టుకున్నారు. మిగతా వాళ్ళు కూడా రోడ్డు వెడల్పు కోసం సహకరించా లని కోరారు.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి రైల్వే గేటు వరకు పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 30 ఫీట్లు మాత్రమే ఉంది.రోడ్డు వెడల్పు చేయడానికి వీలు లేకుండా అనేక మంది తమ నివాస గృహాలు నిర్మించుకున్నారు. ఇళ్ల ముందు కుళాయి గుంతలు, షెడ్డులు ఏర్పాటు చేసుకున్నారు. అయితే రోడ్డు వెడల్పు కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. రోడ్డు వెడల్పు తన ఇంటి నుంచే మొదలు పెట్టాలని అడ్డుగా ఉన్న తన ఇంటిని కూల్చేసి ఆ స్థలాన్ని అధికారులకు అప్పగిం చారు. శనివారం ఉదయం ఆర్‌అండ్‌బి, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు ఆధ్వర్యంలో జేసీబీలతో దగ్గరుండి ఇంటిని కూల్చేయించారు. అదే రోడ్డులో పంచముఖి హనుమాన్ ఆలయం కూడా ఉండటంతో అలయానికి ఇబ్బంది కలగకుండా రోడ్డు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.అభివృద్ధికి ప్రజలు సహకరించాలని, వారం రోజుల్లో రోడ్డుపై ఉన్న కుళాయి గుంతలు, షెడ్డులు ప్రజలే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. నెల రోజుల్లో ఇప్పుడున్న రోడ్డుకు అదనంగా మరొక 24 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించారు.అయితే ఎమ్మెల్యే ఇంటినుంచి పాత బస్టాండ్ వరకు చేపట్టబోయే రోడ్డు వెడల్పులో ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ నివాసం కూడా ఉంది. దాంతో ఆయన స్పందనపై ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

కుటుంబ కలహాలతో భార్య భర్తల ఆత్మహత్య?

టి మీడియా, జనవరి 27,ఆదిలాబాద్: జిల్లా గుడిహట్నూర్ మండలం కొలార్పిలో శనివారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. పురుగుల మందుతాగి దంపతులు ఆత్మహత్య చేసుకున్నారుఆత్మహత్య చేసుకున్న దంపతులను పల్లివి(22), విజయ్(24)గా గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పల్లివి ముందు పురుగుల మందు తాగింది. భార్యమరణం తట్టుకోలేక భర్త విజయ్ కూడా పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా దారి మధ్యలోనే విజయ్ మరణించాడు.గతేడాది మేలో పల్లవి, విజయ్ ప్రేమ వివాహం చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

రైల్వే స్టేషన్‌లో ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య..

టి మీడియా, జనవరి 27,హైదరాబాద్ : రైల్వే స్టేషన్ లో ఊహించని ఘటన చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా శివరాంపల్లి రైల్వే స్టేషన్ లోనే ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవటం కలకలం రేపుతోంది. రైల్వేస్టేషన్ లోకి వచ్చిన ఓ మహిళ.. ఫుట్ ఓవర్ బ్రిడ్జికి తన చున్నీతో ఉరేసుకుని చనిపోవటం కలకం రేపుతోంది. 2024, జనవరి 27వ తేదీ తెల్లవారుజామున.. రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అర్ధరాత్రి సమయంలో ఈ మహిళ ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావిస్తున్నారు రైల్వే పోలీసులు. రైల్వేస్టేషన్ లో ఆత్మహత్య చేసుకున్న మహిళ ఎవరు.. కారణాలు ఏంటీ అనే విషయాలపై విచారణ చేస్తున్నారు. మహిళ దగ్గర ఎలాంటి ఆధారాలు లేకపోవటం, సూసైడ్ నోట్ కూడా లేకపోవటంతో.. ఆత్మహత్య చేసుకుని మహిళ ఫొటోలను అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించారు అధికారులు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శివరాంపల్లి రైల్వేస్టేషన్ ఆత్మహత్య ఘటన చుట్టుపక్కల ప్రాంతాల్లో చర్చనీయాంశం అయ్యింది.

కాంగ్రెస్ ప్రజలను రోడ్డుపైకి తీసుకొచ్చింది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

టీ మీడియా, జనవరి 27, హైదరాబాద్ : బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఇంటింటి సమగ్ర సర్వే చేశామని.. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డుపైకి తీసుకువచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారాక రామారావు విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచామన్నారు. చాలా నియోజకవర్గాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామన్నారు. మోసం చేయడం కాంగ్రెస్ నైజమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు బంగారు పళ్లెంలో తెలంగాణను పెట్టి ఇచ్చామన్నారు. ఇండియా కూటమి నుంచి ఒక్కో పార్టీకి బయటకు వెళ్లిపోతుందన్నారు. బీజేపీని ఓడించాలంటే కాంగ్రెస్ సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్‌ను భరించాలంటే తమ వల్ల కాదని నితీశ్‌కుమార్ అంటున్నారన్నారు. కూటమికి నితీశ్ కుమార్ కూడా బైబై చెప్పారని, బీజేపీని ఆపాలంటే ప్రాంతీయ పార్టీలతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కేసీఆర్ బొండిగ పిసికేస్తా అని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని బండి సంజయ్ అంటున్నాడని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినందుకా, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినందుకా? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ నేతలు వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారని, ఉచిత బస్సు పథకం రచ్చరచ్చ అయ్యిందన్నారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లు ఆగమైపోయారన్నారు. బిల్డప్ కోసం పథకాలు తెస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందన్నారు. రాష్ట్రంలో 51శాతంపైగా మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధమని విమర్శించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను పంపితే తిరస్కరించిన గవర్నర్, కాంగ్రెస్ పంపగానే ఆమోదించిందన్నారు. రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను కలువగానే రెండు ఎమ్మెల్సీలను ఖరారు చేశారని ఆరోపించారు. కిషన్‌రెడ్డికి మరోసారి ఓటు అడిగే హక్కులేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోతే ప్రజలు బాధపడి సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించారని, కేంద్రమంత్రిగా ఒక్క పని చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి రూపాయి నిధులు కూడా కిషన్ రెడ్డి కేటాయించలేదని విమర్శించారు. కేంద్రమంత్రిగా ఉండి ఎందుకు దండగ అన్నారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. మోదీ పాలనలో ధరల పెరుగుదల తప్ప మరేమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనన్న కేటీఆర్. ఇద్దరూ కలిసి రాష్ట్రంలో డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. హామీలను అమలు చేయమంటే కాంగ్రెస్ నేతలకు కోపమొస్తుందని.. ఇందుకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు సరైన సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా కూటమిని గెలిపించాల్సిన ఉందని కేటీఆర్ పిలుపునిచ్చారు.

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుంది

- పట్టణ బిజెపి అధ్యక్షులు బచ్చు రాము

టీ మీడియా, జనవరి 27, వనపర్తి బ్యూరో : భారతీయ జనతా పార్టీ వనపర్తి మాజీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎద్దుల రాజవర్ధన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా వనపర్తి నియోజకవర్గ మండల అధ్యక్షులు కలవడం జరిగింది. వనపర్తి పట్టణ బిజెపి అధ్యక్షులు బచ్చు రాము ఆధ్వర్యంలోఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా తర్వాత కష్టకాలంలో వనపర్తి జిల్లాకు అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత ఎన్నో రకాలుగా పార్టీని ముందుకు నడిపించి రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాలను విజయవంతంగా చేస్తూ అన్ని మండలాల అధ్యక్షులతోనా సమన్వయం ఏర్పరచుకొని మండలాలలో పార్టీ విజయవంతంగా ఎదిగి కిందిస్థాయి ప్రజల్లోపల కూడా నరేంద్ర మోడీ అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ గణనీయంగా ఓటు శాతాన్ని పెంచుకొని అన్ని మండలాలలో పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా నడవడానికి కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. వారు ఇకముందు కూడా పార్టీలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ పూల బొకే అందించి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి టౌన్ అధ్యక్షులు బచ్చు రాము, పెబ్బేరు రూరల్ అధ్యక్షులు భగవంతు యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు వెంకటస్వామి, ఘనపూర్ మండల అధ్యక్షులు నవీన్ రెడ్డి, గోపాల్ పేట్ మండల అధ్యక్షులు అరవింద్ రెడ్డి పెద్దమందడి మండల అధ్యక్షుడు రమేష్ కలవడం జరిగింది. రాబోయే పార్లమెంటు బిజెపి ఎన్నికలలో భారతీయ జనత పార్టీ కచ్చితంగా నాగర్ కర్నూల్ సీటు కైవసం చేసుకుంటుందని ప్రజలు తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని బచ్చు రాము తెలిపారు. భారతదేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో 400 సీట్లు పైగా పార్లమెంట్ సీట్లు రావడం కచ్చితంగా వస్తున్నాయని ప్రజలు తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని మరోసారి నరేంద్ర మోడీని దేశ ప్రధానిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ టికెట్ లేదు

-కలిసిరాలేదని భావిస్తున్నగులాబీ బాస్

-బిల్డర్ తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డికీ ఇవ్వాలనే ఆలోచన



టీ మీడియా, జనవరి 27, కామారెడ్డి : ఆ సిట్టింగ్ ఎంపీకి హ్యాట్రిక్ కలిసిరాదని గులాబీ పార్టీ భావిస్తోందట. ఈసారి ఆ స్థానానికి కొత్త అభ్యర్థి కోసం వెతుకులాట ప్రారంభించిందట. సిట్టింగ్‌లలో కొందరికే టికెట్లు అంటూ క్లారిటీ ఇవ్వడంతో, ఆ సీటుపై కన్నేసి ఓ పెద్దాయన నాకు కావాలి.. అంటూ పట్టుబడుతున్నారట. ఇంతకీ ఏ సిట్టింగ్ ఎంపీకి సీటు గండం పొంచి ఉంది.. ఆ సీటు పై కన్నేసిన ఆ పెద్దాయన ఎవరూ అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది. కామారెడ్డి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉన్న జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి గులాబీ పార్టీ సిట్టింగ్ అభ్యర్థిని మారుస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోందట. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీ రామారావు జహీరాబాద్ పార్లమెంట్ సమీక్షలో సిట్టింగ్ ఎంపీని మారుస్తున్నట్లు హింట్ కూడా ఇచ్చారని టాక్ నడుస్తోంది. కామారెడ్డి జిల్లా సిర్పూర్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త బీబీ పాటిల్ ప్రస్తుతం బీఆర్ఎస్ తరపున సిట్టింగ్ ఎంపీగా కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లో చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు.. బీబీ పాటిల్ దేశంలోనే అతి స్వల్ప మెజార్టీతో గెలిచారు. మరోసారి పోటీకి ఆయన సైతం అంతగా ఆసక్తి చూపడం లేదని పార్టీలో ప్రచారం జరుగుతుంది.జహీరాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ సిట్టింగ్ స్థానం కాపాడుకోవాలని భావిస్తున్న గులాబీ పార్టీ.. ఎంపీ అభ్యర్థిగా కొత్త వారికి అవకాశం ఇవ్వాలని అన్వేషిస్తోందట. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమీక్షలో కేటీఆర్ చేసిన వాఖ్యలు బీబీ పాటిల్ వర్గీయులను షాక్ కు గురిచేశాయట. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లను మార్చి ఉంటే ఫలితాలు మరో విధంగా ఉండేవని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ తప్పిదం చేయమని కీలక వ్యాఖ్యలు చేశారట. దీంతో ఈ సెగ్మెంట్ లో సిట్టింగ్ కు టికెట్టు లేదని చెప్పకనే చెప్పేశారట.జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉండగా. ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడు సెగ్మెంట్లు జహీరాబాద్, ఆందోల్, నారాయణ ఖేడ్ ఉన్నాయి. జహీరాబాద్ పార్లమెంట్ నుంచి బీబీ పాటిల్ 2014, 2019 ఎన్నికల్లో వరుసగా ఎంపీగా విజయం సాధించారు. అయితే రెండోసారి అతి కష్టంగా గెలిచారు. రాష్ట్రంలో అత్యల్ప మెజార్టీతో గెలిచిన స్థానాల్లో జహీరాబాద్ ఒకటిగా ఉందట. బీబీ పాటిల్‌కు జిల్లా నేతలతో సమన్వయం అంతగా ఉండదన్న టాక్ వినిపిస్తోంది. ఫలితంగా ఆయన ఎక్కువ సమయం సంగారెడ్డి జిల్లాకు కేటాయిస్తారని నాలుగు నియోజకవర్గాల గులాబీ శ్రేణులు గుర్రుగా ఉన్నారట.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీ పాటిల్ కాంట్రిబ్యూషన్ పెద్దగా ఏమిలేదని అందరూ పెదవి విరుస్తున్నారట. సిట్టింగ్ ఎంపీని మారుస్తారని ప్రచారం జరుగుతున్న తరుణంలో అక్కడి నుంచి పోటీ చేయించేందుకు.. ప్రముఖ బిల్డర్ తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి, పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోందట. అసెంబ్లీ ఎన్నికల్లో సుభాష్ రెడ్డి పని చేసిన తీరుతో సంతృప్తిగా ఉన్న గులాబీ బాస్ కేసీఆర్ సుభాష్ రెడ్డికి టికెట్ ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నారట. వీరితో పాటు ఆ పార్లమెంట్ పరిధిలో ఓటమి చెందిన మాజీ ఎమ్మెల్యేలు కూడా సుభాష్ రెడ్డి పేరును బలంగా ప్రతిపాదిస్తున్నారట.ఇక ఇప్పటికే సుభాష్ రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాలలో ఉండటం, కామారెడ్డి జిల్లా బీబీపేట మండలంలో ఆరు కోట్ల రూపాయల సొంత నిధులతో నిర్మించిన పాఠశాల తరహాలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రతి మండలంలో అలాంటి పాఠశాల నిర్మించే ప్రతిపాదనతో ముందుకు వెళ్లాలని అనే ఆలోచనలో ఉన్నారట. అటు బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ బీజేపీ నాయకులు కూడా చర్చలు జరుపుతున్నారట. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై గులాబీ జెండా ఎగరాలంటే అభ్యర్థి మార్పు అనివార్యమనే చర్చ జరుగుతోందట. ఆయనకు టికెట్ రాకుండా జిల్లాకు చెందిన కీలక నేతలు చక్రం తిప్పుతుండటం కొసమెరుపు..!

420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



టీ మీడియా, జనవరి 27, వనపర్తి బ్యూరో : బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో వనపర్తి నియోజకవర్గం సమీక్ష సమావేశంలో నిరంజన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు రావుల.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. నిరంజన్ రెడ్డి అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ అమలు కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర బడ్జెట్ అంచనా వేయకుండా దాదాపు 80వేల కోట్ల రూపాయల హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వంచిందని అన్నారు.దాదాపు 70 యుట్యూబ్ చానళ్లు కెసిఆర్ వ్యతిరేఖంగా పనిచేసినాయని కె.సి.అర్ ఇచ్చిన సంక్షేమ పథకాలకు రెట్టింపు స్థాయిలో ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. ఈనాటికీ రైతు బంధు ఇవ్వలేదని,ధాన్యం 500 బోనస్ తో కొంటామన్న మాట నిలుపుకొలేదని,ఆరు గ్యారెంటిలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు.సోషియల్ మీడియా ఆధునిక కాలంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని సోషియల్ మీడియా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ చేస్తున్న మోసాలు వివరించి రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో విజయబేరీ ముగించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయములో కష్టించి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని అన్నారు.కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా కార్యకర్తల అభిప్రాయాలు సావధానంగా విని ఓపికతో సమాధానం చెప్పిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి.

నియోజకవర్గ సమీక్ష సమావేశంలో నిరంజన్ రెడ్డి నాయకుల కంటే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇచ్చి వారి అభిప్రాయాలు సావధానంగా విన్నారు.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం తపిస్తూ పార్టీ కార్యకర్తలకు కొంత సమయం ఇవ్వలేకపోయానని ఇకపై అనునిత్యం మీకు అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రతి పట్టణములో, గ్రామములో మనం ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని అందులో 90శాతం పూర్తి అయినాయి కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి వాటికి మన ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పూర్తి చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అభివృద్ధిని ఓర్వలేక అసూయతో నాపై దుష్ప్రచారం చేసి ఓడించారని నాయకులు,కార్యకర్తలు నా గెలుపు కోసం కృషి చేసారని వారి రాజకీయ భవిష్యత్తు ఉన్నత స్థితిలో ఉంచుతానని అన్నారు.అదేవిధంగా ప్రత్యేక అధికారులను నియమించకుండా సర్పంచుల పదవీ కాలం పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో విజయం కోసం అహర్నిశలు శ్రమించి కృషి చేద్దామని అన్నారు. నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన బి.అర్. యస్ సర్పంచులు, ఉపసర్పంచులకు పదవీ కాలం ముగుస్తున్నందుకు వారు చేసిన సేవలను గుర్తు చేస్తూ సన్మానం చేసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, రావుల చంద్రశేఖర్ రెడ్డి మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నగదుతో పాటు తులం బంగారం

-మరో పథకంపై సీఎం కీలక ప్రకటన

టి మీడియా, జనవరి 27, హైద్రాబాద్ :తాజాగా మరో పథకానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి రేవంత్ రెడ్డి శనివారం కీలక ప్రకటన చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ పథకానికి సంబంధించి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

సర్పంచ్ కు ఘన సన్మానం

టీ మీడియా, జనవరి 27, వనపర్తి బ్యూరో : వనపర్తి నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన బి.అర్. యస్ సర్పంచులు, ఉపసర్పంచులకు పదవీ కాలం ముగుస్తున్నందుకు వారు చేసిన సేవలను గుర్తు చేస్తూ కేశంపేట పాత తాండ సర్పంచ్ రేవల్లి మండలం గౌడ నాయక్ సర్పంచ్ ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నిల్లమ, సౌజన్య, సాయిలీలా, శ్వేత, కవిత, గంగా ప్రసాద్, జోయాబ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సి ఏం ని కలసిన ఏం ఎల్ సి లు

టి మీడియా, జనవరి 27, హైద్రాబాద్ : ముఖ్యమంత్రి శ్ ఏ. రేవంత్ రెడ్డిని డా. బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో శ్ ని ఎా ం ం మర్యాదపూర్వకంగా కలిసిన గవర్నర్ కోటాలో కొత్తగా నియమితులైన ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎం. కోదండరాం, అమీర్ అలీఖాన్ . తమిని ఎంపిక చేయడం పట్ల ధన్యవాద ములు తెలిపారు.

2024 రోడ్డు భద్రత మాసాత్సవాలు

టీ మీడియా, జనవరి 27, రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాల లో భాగంగా కమిషనర్ రెమా రాజేశ్వరి డిఐజి ఆదేశాల మేరకు జనవరి15 నుండి ఫిబ్రవరి15 వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు క్యాతనపల్లి రైల్వే గేటు వద్ద ఎస్సై జి.రాజశేఖర్ పాల్గొని రోడ్డు భద్రత గురించి వాహనదారులకు హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించడం జరిగింది.ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు.హెల్మెట్ ధరించిన వారికి పూలు అందించి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లి నూతన సిఐ గా కృష్ణ

టీ మీడియా, జనవరి 27, పెద్దపల్లి : పెద్దపల్లి,పోలిస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా కృష్ణను నియమిస్తూ శనివారం ఐజి కార్యాలయం నుండి ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ అనిల్ కుమార్ ని ఐజి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నూతన సిఐ. కృష్ణ లక్షెట్టిపేట సిఐ గా విధులు నిర్వర్తిస్తున్నారు. పెద్దపల్లి నూతన సీఐగా పదవి బాధ్యతలు చేపట్టనున్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేత తీగల కృష్ణారెడ్డి

యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలి

- శ్రీ గాయత్రీ ఎడ్యుకేషన్స్ చైర్మన్ సూరగౌని శ్రీనివాస్

టీ మీడియా, జనవరి 27, వనపర్తి బ్యూరో : యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలని ఆటల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని క్రీడాకారులకు నా పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని శ్రీ గాయత్రీ ఎడ్యుకేషన్స్ చైర్మన్ సూరగౌని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేర్ మండలం రాజపూర్ గ్రామంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన గ్రామస్థాయి క్రీడా పోటీల్లో మొదటి బహుమతిని కైవసం చేసుకున్న విద్యార్థి గోవర్ధన్ ను ఈరోజు ఆయన సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు కీర్తిని గడించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని బహుమతులు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ సరఫరాలో అదనపు చార్జీలు వసూలు చేయవద్దు

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

టీ మీడియా, జనవరి 27, పెద్దపల్లి : కస్టమర్లకు ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే సమయంలో ఎటువంటి అదనపు డెలివరీ చార్జీలు వసూలు చేయకుండా డీలర్లు జాగ్రత్త వహించాలని అదనపు కలెక్టర్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లాలోని ఎల్.పి.జి డీలర్లతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ.. ఎల్.పి.జి డీలర్లు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసినప్పుడు వినియోగదారుల దగ్గర్నుంచి డెలివరీ బాయ్స్ అదనపు చార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని,డెలివరీ బాయ్స్ అదనపు డెలివరీ చార్జీలు వసూలు చేసిన సంఘటన ఏమైనా ఉంటే వెంటనే సదరు డెలివరీ బాయ్స్ ను ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశించారు. ఎల్.పి.జి డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ కస్టమర్లతో ఎప్పటికప్పుడు ఫోన్ లో వివరాలు సేకరిస్తూ వినియోగదారు లకు గ్యాస్ సక్రమంగా సరఫరా అవుతుందో లేదో తెలుసుకోవాలని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఏజెన్సీలతో పాటు వారి సిబ్బంది మీద కూడా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ.ప్రేమ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్న పూర్వ విద్యార్థులు



టీ మీడియా, జనవరి 27, రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం శ్రీనివాస గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. 1997-1998 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలిసి ఆనాటి జ్ఞాపకాలన్నీ గుర్తు చేసుకున్నారు. చదువుకున్న స్నేహితులతో కలిసి ఆనందోత్సాహాలతో గడిపారు.వారి స్నేహితుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఆనందంగా పూర్వ విద్యార్థులందరూ హాజరై తోటి స్నేహితులతో, అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థి దశలో తెలిసి తెలియని వయసులో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకుంటూ ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకాలు అని అన్నారు.మనుషులు దూరమైన మమతలు కలిసి ఉంటాయన్నారు.అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి సహపంక్తి భోజనం చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ గెట్ టూ గెదర్ కి బద్రి సంతోష్ కుమార్ అధ్యక్షత వహించాడు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

- మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని

టీ మీడియా, జనవరి 27, మహానంది: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని అన్నారు. శనివారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు బుడ్డా రెడ్డి యశస్విని అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశంలో గడచిన మూడు నెలల అభివృద్ధి పురోగతిపై అధికారులు వివరించారు. మండలంలోని పలు గ్రామాలలోని పలు సమస్యల పై మండల అధికారులతో చర్చించారు. ఎంపీపీ బుడ్డా రెడ్డి యశస్విని మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తూ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశానికి హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివ నాగజ్యోతి కి తెలిపారు. గ్రామాలలో డ్రైనేజీ, పారిశుధ్యం, దోమల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్వసభ్య సమావేశంలో తెలియజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం మహానంది మండలంలోని ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఈసీ రామేశ్వర రెడ్డికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుండి ప్రశంస పత్రం అందుకున్నందుకు మండల అధ్యక్షురాలు బుడ్డా రెడ్డి యశస్విని, తహసిల్దార్ జనార్దన్ శెట్టి, ఎంపిడిఓ శివ నాగజ్యోతి తదితర అధికారులు ఆయనను పూలమాలలు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సమావేశంలో తహసిల్దార్ జనార్దన్ శెట్టి, ఎంపీడీవో శివ నాగ జ్యోతి, జడ్పిటిసి కెవిఆర్ మహేశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి బి నాగేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి,మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో ప్రయాణం చేసిన కేటీఆర్..

టీ మీడియా, జనవరి 27,హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న అనంతరం తెలంగాణ భవన్‌కు ఆటోలో ప్రయాణించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. కాగా, రాహుల్ భారత్ జోడో అంటుంటే.. కాంగ్రెస్ మిత్రపక్షాలు రాహుల్ కా చోడో అంటున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీజేపీని, మోడీని ఎదుర్కోవాలి అంటే ప్రాంతీయంగా బలంగా ఉన్న నాయకులతోనే సాధ్యమన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ బొండిక పిసకాలి.. బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలి అని కొందరు మాట్లాడుతున్నారని మండి పడ్డారు. బీఆర్ఎస్‌ను ఎందుకు బొంద పెట్టాలి? తెలంగాణ తెచ్చినందుకా? తెచ్చిన తెలంగాణలో పేదలని కడుపులో పెట్టుకొని చూసుకున్నందుకా? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ - బీజేపీది ఫెవికాల్ బంధమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున డమ్మీ అభ్యర్థులను పెట్టి బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడం అంటే బీజేపీకి ఓటు వేసినట్లేనన్నారు. కాంగ్రెస్, బీజేపీ మంచి అవగాహనతో కలిసి పనిచేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఆదానిని తిట్టి.. అధికారంలోకి రాగానే దావోస్‌లో వెళ్లి ఒప్పందాలు చేసుకొని వచ్చారని నిప్పులు చెరిగారు.

ముగుస్తున్న రేషన్ కార్డుల ఈ-కేవైసీ గడువు..



టీ మీడియా, జనవరి 27, హైదరాబాద్: బోగస్ కార్డుల ఏరివేతకు చేపట్టిన రేషన్ కార్డుల ఈ-కేవైసీ గడువు దగ్గపడుతున్నది. మరో నాలుగు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనున్నది. జనవరి 31తో సమయం ముగియనుండటంతో ఇంకా అప్డేట్ చేయించుకోని వారు వెంటనే పూర్తిచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. చాలా పాత కార్డుల్లో చనిపోయిన వారి పేర్లు, పెండ్లి చేసుకుని వేరే ప్రాంతాలకు వెళ్లిన ఆడపిల్లల పేర్లు అలాగే ఉన్నాయి. దీంతో రేషన్ సరుకులు పక్కదారి పడుతున్నాయి. దీనిని అరికట్టేందుకు రాష్ట్రంలో గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ-కేవైసీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా లబ్ధిదారుల నుంచి వేలిముద్రలను మళ్లీ సేకరిస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉంటున్నవారు అక్కడి రేషన్ షాపుల్లో కేవైసీ పూర్తిచేసుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 31తో కేవైసీ ప్రక్రియ ముగియనున్నది. మరోసారి గడువు పెంచే అకాశం లేనట్లు తెలుస్తున్నది.

మరాఠా రిజర్వేషన్ల ఆందోళనకు ఫుల్‌స్టాప్

- దీక్ష విరమించిన మనోజ్ జరాంగే

టీ మీడియా, జనవరి 27,ముంబై : మరాఠా రిజర్వేషన్ల కోసం సాగుతున్న ఆందోళనకు ఫుల్‌స్టాప్ పడింది. మరాఠా ఉద్యమకారుల డిమాండ్లకు మహారాష్ట్ర ప్రభుత్వం తలొగ్గింది. డిమాండ్లను నెరవేరుస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మరాఠా రిజర్వేషన్ ఉద్యమ నాయకుడు మనోజ్ జరాంగే పాటిల్ తన ఆందోళనను విరమించారు. సీఎం ఏక్‌నాథ్ షిండే నవీ ముంబైలోని దీక్షా శిబిరానికి చేరుకుని మనోజ్ జరాంగేకి పళ్ల రసం ఇచ్చి నిరాహార దీక్షను విరమింపజేశారు. అలాగే, రిజర్వేషన్లపై ప్రభుత్వ హామీలకు సంబంధించిన పత్రాన్ని జరాంగేకు సీఎం షిండే అందించారు. అనంతరం సీఎం ఏక్‌నాథ్ షిండే, మనోజ్ జరాంగే ఇద్దరూ కలిసి నవీ ముంబైలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారుమరాఠా రిజర్వేషన్లను శనివారం ఉదయం 11 గంటల వరకు ప్రభుత్వానికి మనోజ్ జరాంగే అల్టిమేటం ఇచ్చారు. తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో ముంబై నగరాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆజాద్ మైదాన్ దగ్గర ఆందోళనకు మరాఠా ఉద్యమకారులు ఏర్పాట్లు చేసుకున్నారు. తమ డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించకుంటే..ఆజాద్ మైదానం వరకూ పాదయాత్ర చేస్తామని జరాంగే హెచ్చరించారు. ఆజాద్ మైదాన్‌కు బయలుదేరిన తర్వాత నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేది లేదని.. రిజర్వేషన్ డిమాండ్ సాధించిన తర్వాతే ఇళ్లకు వెళ్తామని స్పష్టం చేశారు. అయితే గత అర్ధరాత్రి ప్రభుత్వ ప్రతినిధుల బృందం జరాంగేతో చర్చలు జరిపింది. హామీలు నెరవేరుస్తామంటూ ప్రభుత్వం నుంచి భరోసా ఇచ్చింది. ఆ మేరకు ఆర్డినెన్స్ ముసాయిదాను కూడా విడుదల చేసింది. దీంతో ఆందోళనను విరమిస్తున్నట్లు జరాంగే ప్రకటించారు. మొత్తానికి మరాఠా రిజర్వేషన్ల ఆందోళనను ప్రశాంతంగా ముగియడంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఊపిరి పీల్చుకుంది.విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నది మనోజ్ జరాంగే డిమాండ్. ఈ డిమాండ్‌తో ఈ నెల 20న మహారాష్ట్రలోని అంతర్ వాలి గ్రామం నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. వాస్తవానికి ఈరోజు ఈ ర్యాలీ, ముంబై నగరంలోకి ఎంటర్ కావాల్సి ఉంది. ఒకవేళ, అదే జరిగితే, హింసాత్మక ఘటనలు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావించింది. దీంతో అర్ధరాత్రి చర్చలు జరిపి, ఈ ర్యాలీ ఆగేలా చేయడంలో ప్రభుత్వం సక్సెస్ అయింది.మహారాష్ట్ర జనాభాలో మరాఠాలు 33 శాతం ఉన్నారు. అయితే అన్నిరంగాల్లో వెనుకబడ్డ తమకు రిజర్వేషన్లు కల్పించాలని ఆ వర్గం ఎప్పటినుండో డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో 2018 నవంబర్ 30న బీజేపీ ప్రభుత్వం..మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును ఆమోదించింది. అయితే ఈ బిల్లును 2021 మే 5న సుప్రీంకోర్టు కొట్టివేసింది. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని అతిక్రమించి మరాఠా రిజర్వేషన్ కల్పించడంలో ఎలాంటి సహేతుకత కనిపించడం లేదని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అప్పటినుండి ఈ ఉద్యమం కొనసాగుతోంది

దూకుడు పెంచిన వైఎస్ షర్మిల

- వైసీపీ, టీడీపీపై మాటల తూటాలు..

టి మీడియా, జనవరి 27,అమరావతి: తెలంగాణలో వైఎస్ఆర్టీపీ స్థాపించి కాంగ్రెస్?లో విలీనం చేసి ఏపీ పీసీసీగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల రాజకీయంగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. పదునైన మాటలు, నికాసైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా పర్యటనలు మొదలు పెట్టేశారు. ఈ తరుణంలో వైసీపీ నేతలు షర్మిల గతంలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ సందర్భంగా వారి మాటలకు తనదైన తూటాలను ఎక్కుపెడుతున్నారు షర్మిల. తాజాగా వైసీపీ నేతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తనపై ముప్పేట దాడి చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీని భుజాన వేసుకుని పనిచేశానన్నారు. నారక్తం, చెమట ధారపోశానని గతాన్ని గుర్తుచేశారు. ఇక్కడ ఎవరూ భయపడరు యుద్ధానికి మేము రెడీ.. మీరు రెడీనా అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఏపీలో ప్రత్యేక హోదా రావాలి.. పోలవరం పూర్తికావాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలి. అందుకే రాజన్న బిడ్డగా ముందుకు వచ్చానని చెప్పుకొచ్చారు.గుండ్లకమ్మ ప్రాజెక్టుకు మెయింటెన్స్ చేసే దిక్కు కూడా లేకుండా పోయిందని విమర్శించారు. టీడీపీ, వైసీపీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయని ఆరోపించారు. వైయస్ఆర్ ఆశయాలను నెరవేరుస్తున్నామని చెబుతున్న వారు ప్రాజెక్టును ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వైయస్ఆర్ లేరన్నారు. ఇది జగన్ పార్టీ ప్రజలను పట్టించుకోని పార్టీ అంటూ సంచలన కామెంట్స్ చేశారు. వై అంటే వైవి సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే రామకృష్ణారెడ్డి అని ఎద్దేవా చేశారు. జిల్లాలో నిమ్జ్ ఏర్పాటు చేయాలని వైఎస్ఆర్ సంకల్పించారన్నారు. తద్వారా 3 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనుకున్నారు. జగన్ సీఎం కాకముందు నిమ్జ్‌ను పూర్తి చేస్తామని చెప్పి ఒక్క ఇండస్ట్రీని కూడా తీసుకురాలేదన్నారు. ఏ ఒక్కరికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారన్నారు. జిల్లాకో ఎయిర్ పోర్టు అని చెప్పారు. బోయింగ్‌లు తిప్పుతామన్నారు చెప్పిందంతా గాలికి పోయిందన్నారు.

మహాముదురు.. శివ బాలకృష్ణ

-రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు

టి మీడియా, జనవరి 27, హైద్రాబాద్ : హెచ్ఎండీఏమాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ అక్రమాస్తుల కేసులో దర్యాప్తు ముమ్మరం చేశారు. శివ బాలకృష్ణను కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోరారు. బాలకృష్ణ రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు ప్రస్తావించారు. లేఔట్ల అనుమతుల కోసం భారీగా లంచాలు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. చాలా దరఖాస్తుల్లో తప్పులు ఉన్నాయన్న సాకుతో లంచాలు తీసుకున్నట్లు గుర్తించారు. శివ బాలకృష్ణ ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ, రేరాలో అక్రమాలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది.మొత్తం 45 పేజీల రిమాండ్ రిపోర్టులో పలు కీలక అంశాలు ప్రస్తావించారు ఏసీబీ అధికారులు. శివ బాలకృష్ణకు సంబంధించి 4కోట్ల 90 లక్షల రూపాయలు విలువైన స్థిరాస్తులు, 8కోట్ల 20లక్షల రూపాయల విలువైన చరాస్తులు గుర్తించారు. కేవలం డాక్యుమెంట్ల ప్రకారమే శివ బాలకృష్ణ ఆస్తుల విలువ రూ.10కోట్లు అని గుర్తించిన అధికారులు, బహిరంగ మార్కెట్ లో దీని విలువ పది రెట్లు ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.ప్లాట్ల నిర్మాణ అనుమతులు ఇచ్చేందుకు శివ బాలకృష్ణ విల్లాలను లంచంగా పొందారని, వాటిని బినామీల పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని గుర్తించారు. ఇక, హెచ్ఎండీఏ ఆఫీసులోని 5వ అంతస్తులో కొద్దిమందికి మాత్రమే ప్రవేశం ఉండేదని, బాలకృష్ణకు పరోక్షంగా 30మంది అధికారులు సహకరించారని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో మరింత సమాచారం రాబట్టేందుకు బాలకృష్ణ ఫోన్లను రిట్రైవ్ చేస్తున్నారు. రెండేళ్ల క్రితమే బాలకృష్ణపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. హెచ్ఎండీఏలోని మూడు జోన్లపై బాలకృష్ణకు పట్టుంది. ఆయన పరిధిలో ఉన్న జోన్ లో ఒక్కో ఎకరం రూ.20 కోట్లపైనే ఉంటుందని తెలిపారు. వట్టినాగులపల్లిలో భూవినియోగ మార్పిడి జీవోపై ఏసీబీ ఫోకస్ పెట్టింది. బాలకృష్ణను కస్టడీలోకి తీసుకున్న తర్వాత బ్యాంకు లాకర్లను ఓపెన్ చేయించారు ఏసీబీ అధికారులు.

వైసీపీకి ఎదురుదెబ్బ

-కాంగ్రెస్‌లోకి సీనియర్ నేత

టీ మీడియా, జనవరి 27, గన్నవరం: కృష్ణా జిల్లాలో వెసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం సీనియర్ నేత, ప్రముఖ వైద్యుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇటీవల డాక్టర్ రామచంద్రరావును ఆయన నివాసంలో కలిశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రామచంద్రరావు త్వరలో కాంగ్రెస్‌లో చేరతారని చెప్పారు. డాక్టర్ రామచంద్రరావు 2014లో వైఎస్సార్‌సీపీ టికెట్‌పై పోటీ చేసి టీడీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ చేతిలో ఓడిపోయారు. రామచంద్రరావుపై వంశీ 9,548 ఓట్ల తేడాతో విజయం సాధించారు. వంశీకి 99,163 ఓట్లు రాగా, రామచంద్రరావుకు 89,615 ఓట్లు వచ్చాయి.రామచంద్రరావు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. రాష్ట్ర పర్యటనలో ఉన్న షర్మిల గురువారం సాయంత్రం గన్నవరంలో కొద్దిసేపు ఆగి డాక్టర్ రామచంద్రరావును కలిసి.. పలు సామాజిక, రాజకీయ అంశాలపై చర్చించారు. గన్నవరం నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున రామచంద్రరావు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సోషల్ సర్వీస్‌తో పాటు, పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం ద్వారా రామచంద్రరావుకు ఆ ప్రాంతంలో మంచి పేరు ఉంది. పార్టీలో తనకంటే.. ఫిరాయించిన ఎమ్మెల్యే వంశీకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని భావించిన డాక్టర్ రామచంద్రరావు వైఎస్సార్‌సీపీ హైకమాండ్‌పై కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నారు. వంశీకి సహకరించేది లేదని పలుమార్లు బహిరంగంగా మీడియాతోనే చెప్పారు. కాగా 2019లో గన్నవరం వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన యార్లగడ్డ వెంకట్రావు.. టీడీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ చేతిలో స్వల్ప ఓట్లతో ఓటమి చెందారు. అయితే ఆ తర్వాతి కాలంలో వంశీ వైసీపీలోకి రాగా.. యార్లగడ్డ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి దుట్టా ఈసారి బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. దీంతో ఈ సారి గన్నవరం పోరు ఆసక్తికరంగా మారనుంది.

మితిమీరిన ఉత్సాహం.. జైలుకు పంపింది

టీ మీడియా, జనవరి 27,హైదరాబాద్ : వేదికగా ఫస్ట్ టెస్టులో భారత్-ఇంగ్లండ్ జట్లు తలపడుతున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ తొలి రోజు ఆట సందర్భంగా ఓ అనూహ్య ఘటన చోటుచేసు కుంది. ఓ ఫ్యాన్ సెక్యూరిటీ సిబ్బంది కళ్లుగప్పి గ్రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. పరిగెత్తుకుంటూ వెళ్లి ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ కాళ్ళు మొక్కాడు. హిట్ మ్యాన్ వద్దు అని వారిస్తున్నప్పటికీ అతడు మాత్రం వినిపించుకోలేదు. వెంటనే అప్రమత్తమైన.. గ్రౌండ్ సెక్యూరిటీ సిబ్బంది అతడిని బయటకు తీసుకు వెళ్లారు. ఈ ఘటనను రాచకొండ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. గ్రౌండ్‌లోని దూసుకెళ్లిన యువకుడ్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన హర్షిత్ రెడ్డిగా గుర్తించారు. హర్షిత్ రెడ్డిపై కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు.. న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో.. జైలుకు తరలించారు.క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ వీక్షించే ప్రేక్షకులు.. వారికి కేటాయించిన సీట్లలో మాత్రమే కూర్చోవాలని.. అతిగా ప్రవర్తించి మైదానంలోకి వెళ్తే.. కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటన అనంతరం క్రికెటర్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్టేడియంలో భద్రతను పెంచారు. ముగిసిన మూడో రోజు ఆట ఉప్పల్ వేదికగా భారత్ ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న మొదటి టెస్టు మూడో రోజు ఆట ముగిసింది. ఇంగ్లాండ్ బ్యాటర్ ఓలీ పోప్ (148బి) అద్భుత సెంచరీతో ఆ జట్టును ఆదుకున్నాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన ఇండియా.. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను త్వరగానే చుట్టేస్తుందని అనుకున్నారు. కానీ, ఓలీ పోప్ మాత్రం క్రీజ్‌లో పాతుకుపోయాడు. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసేసరికి ఆరు వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. క్రీజ్‌లో పోప్‌తో పాటు రెహాన్ (16బి) ఉన్నాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 190 పరుగులు వెనకబడిన ఇంగ్లాండ్ చివరికి 126 పరుగుల లీడ్ సాధించింది.